# అత్యాచారం

తలుపు తీసి, ఆ వచ్చిన వాళ్ళని చూసి సేల్స్ ప్రమోటర్స్ కాబోలు ననుకుని "ఏమీ అక్కర్లేదు, దయచేసి వెళ్ళండి" అంటూ తలుపు మూయబోయాను.

వచ్చిన అయిదుగురిలో వెనకాల నిలబడిన గడ్డం యువకుడు చటుక్కున ముందున్న ఆడవాళ్ళని తోసుకుని ముందుకొచ్చి "మీరు ఆసావేరి' గారు కదా మేడమ్" అన్నాడు. అక్కడికీ అనుమానం తీరక "మీరెవరు?" అన్నాను.

"నా పేరు 'దండోరా'. నేను 'ఆంధ్ర సాంస్కృతిక సంస్థలూ-సన్మానాలూ' అనే విషయం మీద పరిశోధన చేస్తున్నానండీ. వీరంతా వర్ధమాన రచయిత్రులు" అన్నాడు. నేను కాస్త తొట్రుపడి, "అలాగా! రండి లోపలికి" అని సాదరంగా ఆహ్వానించాను. వాళ్లు కూర్చున్నాక అడిగాను "ఏమిటి విశేషం? ఇలా వచ్చారు" అని.

ఆ ఆడవాళ్ళలో అందరికన్నా లావుపాటావిడ గొంతు సవరించుకుంది. ఉలిక్కిపడ్డాను. ఆవిడవైపు చూశాను.

"నేను 'విహ్వల భారతి' అనే వనితా సాంస్కృతిక సంస్థకి కార్యదర్శిని. ప్రతి సంవత్సరం ఒక ప్రముఖ మహిళకి సన్మానం చేస్తుంటామండీ. ఈ సంవత్సరం మీకు సన్మానం చెయ్యాలని మా కమిటీ తీర్మానించిందండీ" అంది వంకరగా నవ్వుతూ.

"అమ్మ బాబోయ్!" అన్నాను. గుండెమీద చెయ్యివేసుకున్నానో లేదో, ఆ కంగారులో ఏం చేశానో నాకే స్పృహలేదు.

"అదేమిటండీ, అంత కంగారు పడ్డారు!" అన్నాడా గడ్డపు యువకుడు.

"నేను వేదిక కింద, వెనక వరసలో ఓ మూల కూర్చోవడమేగాక ఇంతవరకు వేదిక ఎక్కలేదండి ఎప్పుడూ. అదీకాక, నేను ఎన్నో కథలు రాయలేదు కదా, నాకు సన్మానం ఏమిటండీ!" అన్నాను వణుకుతున్న కంఠంతో.

గలగలమంటూ గవ్వల శబ్దంలా వినిపించింది. కాదు, వాళ్ల లావుపాటావిడ నవ్వింది. అంతవరకూ ఒదిగి కూర్చున్నావిడ వెనక్కి జార్ల బడి కాలుమీద కాలు వేసుకుని, "వేదిక మీద కూర్చోవడానికి భయం దేనికండీ! అక్కడ కూర్చుంటే, కింద కూర్చుని వినే వాళ్లంతా ఎంత అల్పులుగా కనిపిస్తారో మీకేతెలుస్తుంది. మీరు ఒప్పుకోవాలి ఆసావేరిగారూ" అంది.

నేను నోరు మెదిపే లోపల మరో రచయిత్రి అందుకుంది. "ప్రసిద్ధ గాయని కీచుబాయి గారూ, ప్రఖ్యాత సినీతార 'రోతశ్రీ' గారూ ప్రత్యేక అతిథులుగా వస్తారు ఆ సన్మాన సభకి" అందామె నన్ను ఊరించడానికన్నట్లు.

"ఇంతకీ నాకే సన్మానం చెయ్యాలని ఎందుకు నిశ్చయించుకున్నారు?"

"అలా అడగండి చెబుతాను" అన్నట్లు ఉత్సాహంగా కాస్త ముందుకి జరిగి, ఒక బక్కపలచగా ఉన్నావిడ మొదలు పెట్టింది-గంగిగోవు పాలు గంటెడైనను చాలు అన్నట్లు మీరు కొంచెం కథలు రాసినా, మీ కథలకు ఎంచుకున్న ఇతి వృత్తాలు చెప్పుకోదగినవి.." అంది.

"అటువంటి ఇతివృత్తాల మీద ఎన్నో కథలూ నవలలూ వచ్చాయి కదండీ, నా రచనలు ఏ పాటివి? - సముద్రంలో నీటి బొట్టులా" అన్నాను.

"అమ్మో అలా అనకండి ఒక అబలపైన మూకుమ్మడిగా అత్యాచారం జరపడాన్ని మీరు చిత్రించినట్లుగా ఎవ్వరూ చిత్రించలేదు. దానికి మీరు చూపించిన పరిష్కారం కూడా కనీవినీ ఎరుగనిది" అంది.

నేను సిగ్గుపడి తలవంచుకున్నాను. దాన్ని అంగీకారంగా తీసుకున్నారులా ఉంది. అంతాలేచి నుంచుని "వస్తాం మేడమ్. మీకు మా ధన్యవాదాలు. సన్మాన సభ వచ్చే ఆదివారం సాయంకాలం ఆరు గంటలకి 'సన్మాన్ భవన్' లో జరుగుతుంది" అన్నారు. నేనింకా ఆ 'షాక్' నుంచి తేరుకోకముందే వెళ్ళిపోయారు వాళ్ళు.

నేను గొప్ప రచయిత్రిని అంటూ ఎంత ఉప్పొంగుదామన్నా ఎందుకో గుండె కుంచించుకు పోతోంది.

ఆదివారం రానే వచ్చింది. అనుకున్న దాని కన్న ముందే వచ్చేసినట్లనిపించింది నా ప్రాణానికి. పొద్దున్నే ఆ సన్మాన సభ తాలూకు మనిషొకడు వచ్చి "సాయంకాలం 5.30కి కారు తీసుకొస్తారు. రెడీగా ఉండండి అని చెప్పి వెళ్లాడు. ఏం చెయ్యాలో తోచక, నేను రాసిన కథల్ని మరోసారి చదువుకున్నాను. నా హృదయం ఎందుకో ఆర్ద్రమైంది.

ఎర్రంచు తెల్లచీర కట్టుకొని కూర్చున్నాను, కారు కోసం ఎదురుచూస్తూ, 'రోట్లో తల దూర్చి రోకటి పోటుకి వెరపేలా' అన్నట్లుగా ఉంది నా పరిస్థితి.

ఆ సంస్థ కార్యదర్శి వచ్చింది కారులో నన్ను తీసుకు వెళ్ళడానికి. ఆవిణ్ణి చూశాక నాకు కొంచెం ధైర్యం చిక్కింది–అంత క్రితం ఆవిడ చెప్పిన 'వేదిక రహస్యం' గుర్తుకొచ్చి. మా వారు 'బెస్ట్ ఆఫ్ లక్' అని పొద్దున్నే చెప్పారు.

'సన్మాన్ భవన్' సమీపిస్తూనే సన్నాయి వాద్యం లౌడ్ స్పీకర్ల లోంచి చెవులు హోరెత్తేటట్లు వినిపించింది. నా పెళ్ళికి కూడా అంతగట్టిగా వాయించలేదు. "సన్నాయి వాళ్ళని కూడా పెట్టారేమిటి?" అన్నాను సిగ్గు పడుతూ.

కార్యదర్శి గల గలా నవ్వి, "అబ్బే, అది టేప్‌రికార్డరండీ" అంది. ఒక నిట్టూర్పు వెలువడింది నాలోంచి.

ఎవరెవరో కార్యకర్తలూ, పెద్దలూ నన్ను సగౌరవంగా లోపలికి తీసుకువెళ్ళారు. సభ ప్రారంభం కావడానికి ఇంకా వేళ కాలేదని నన్ను అందాకా ముందు వరసలో కూర్చోబెట్టారు. ఎవరెవరో వచ్చి పలుకరిస్తున్నారు. నేను యథోచితంగా సమాధానాలు చెబుతున్నాను. అర గంటయింది. గంటయింది. ప్రఖ్యాత సినీతార 'రోతశ్రీ'గారు షూటింగ్ పూర్తి చేసుకుని ఇప్పుడే బయలుదేరారనీ, ఇంకో ఇరవై నిముషాల్లో సభకి చేరుకుంటారనీ కబురొచ్చింది. ఈ లోగా కరెంటు పోయింది. అంతా గందర గోళం, చీకటి, హడావిడి, ఆ చీకట్లోనే కాలక్షేపానికి ఒక ఔత్సాహిక గాయని చేత సినిమా పాటలు పాడించారు.

సినీతార 'రోతశ్రీ' గారు రావడం కరెంటు రావడం ఒకేసారి జరిగింది. అదృష్ట దీపం వెలిగినట్లు ఆనందించారు అందరూ.

సభ ఆరంభమైంది. వేదిక మీదకి ఆ సభకి అధ్యక్షురాలైన ప్రఖ్యాత జోస్యకారిణి అభయాంబ గారినీ, ప్రసిద్ధ గాయని కీచుబాయి గారినీ, 'విహ్వల భారతి' సంస్థాపకురాలు, మహిళాలోకానికి ఎనలేని సేవచేస్తున్న అకుంఠితాదేవి గారినీ, ప్రఖ్యాత సినీతార 'రోతశ్రీ' గారినీ నన్నూ ఆహ్వానించింది 'విహ్వలభారతి' కార్యదర్శి. కొంచెం ఆలస్యంగా రొప్పుకుంటూ వచ్చిన భయానక, హింసాత్మక, సంచలనాత్మక నవలా రచయిత్రి, శ్రీమతి ఘటికవల్లిగారు కూడా కార్యదర్శి ఆహ్వానాన్ని పురస్కరించుకుని వేదికని అలంకరించారు.

జోస్యకారిణి అభయాంబ గారు సభని ప్రారంభిస్తూ, నా గురించి మాట్లాడడం మొదలు పెట్టారు. "...నిజం చెబుతున్నాను. శ్రీమతి ఆసావేరి ఇంతటి ఘన సన్మానాన్ని అందుకోగలదని నేను అనుకోలేదు. ఈమె నాకు చిన్న పిల్లప్పటి నుంచీ తెలుసు. మా ఇంటి పక్కనే ఉండేది వీళ్ళిల్లు పెంటపాడు గ్రామంలో. చీమిడి ముక్కు తుడుచుకుంటూ, చెడ్డీ ఎగలాక్కుంటూ, తొక్కుడుబిళ్ళ ఆడుతూండేది మా ఇంటిముందు. అటువంటి చిన్నారి

ఈనాడు మహారచయిత్రిగా సన్మానాన్ని పొందడం నిజంగా నా జోస్య ఫలితం కాదు. ఆమె పూర్వజన్మ సుకృతం అనే నమ్ముతున్నాను. పట్టుమని పది కథలైనా రాయని ఈ మహారచయిత్రికి ఆమె రాశిని చూసి కాక, వాసిని చూసి అనుకుంటాను– 'విహ్వల భారతి' అధినేతలు ఉదారంగా చేస్తున్న ఈ సన్మానానికి వారిని అభినందిస్తున్నాను. ముందు ముందు మరెంతో మంది మహిళలు ఈ విధంగా 'విహ్వలభారతి' ఔదార్యానికి నోచుకోగలరని జోస్యం చెబుతున్నాను..." అందరూ చప్పట్లు కొడుతూంటే వెర్రిమొహం వేసుకుని చూశాను.

ఇప్పుడు, ప్రఖ్యాత సినీతార, ఆంధ్రుల ప్రియతమతార 'రోతశ్రీ' గారు శ్రీమతి ఆసావేరి గారికి పూలమాలవేసి శాలువా కప్పి సత్కరిస్తారు అనేసరికి మళ్ళీ కరతాళ ధ్వనులు. ఇంతలో ఇద్దరు 'విహ్వల' వనితలు పెద్ద పూలమాలని మోసుకుంటూ వచ్చారు. మరొకరు పళ్ళెంలో శాలువా పెట్టి పట్టుకొచ్చారు. ఆ దండ నా మెడలో పడడానికి 'రోతశ్రీ' గారికి ఆ ఇద్దరు వనితలూ సాయం చేశారు. అసలే సిగ్గుతో వంగిన నా మెడ మరింత కుంగిపోయింది. దానికి తోడు శాలువా కప్పారు. అయినా నా వణుకు తగ్గలేదు!

ఆ తరవాత, నృత్యకార్యక్రమం ఉంటుందనీ, అయినా, వేదిక మీద ఎక్కడి వాళ్ళక్కడే ఉంటారనీ, వారిముందే బేబీ చిట్టిమాలిని బ్రేక్ డాన్స్ చేస్తుందనీ, ఇదొక కొత్త ప్రయోగం అనీ, బేబీ చిట్టిమాలిని ఎవరో కాదు, అకుంఠితాదేవిగారి ముద్దుల మనవరాలేననీ చెప్పారు. అంతా జేజేలు పలికారు...డాన్స్ పూర్తికాగానే 'రోతశ్రీ' గారు కుర్చీలోంచి లేచి, ముందుకెళ్ళి చిట్టిమాలినిని అమాంతం ఎత్తుకుని ముద్దుపెట్టుకుని, "నా అంతటి దానివవుతావ"ని ఆశీర్వదించారు. అందరూ ఒకటే చప్పట్లు.

తరవాత 'రోతశ్రీ' గారు ప్రసంగిస్తారని అధ్యక్షురాలు ప్రకటించారు. 'రోతశ్రీ' గారు దరహాసంతో నా వైపు క్రీగంట చూసి సభలోని ప్రేక్షకులను చూసి మందహాసం చేసి, "ఈనాడు ఈ సన్మానసభకి నన్నెందుకు ఆహ్వానించారో నాకు తెలుసు. సభాలంకరణకి నా 'గ్లామర్' కూడా తోడైతే బావుంటుందని కదూ. (అంతా చప్పట్లు)... నిజానికి నేను ఈ రచయిత్రి కథలను ఒక్కటికూడా చదవలేదు. అసలు నేనేమీ చదువుకోలేదు కదా! (మళ్ళీ చప్పట్లు).... చదువుకోక పోయినా సంస్కారం, లోకజ్ఞానం లేని దాన్ని కాదు...ఎన్నికథలు పత్రికల్లో అచ్చయినా, నాలాంటి వారిదాకా ఆ కథలు చేరాలంటే, సినిమాలకి కథలు రాయాలి. ఈమె ఎప్పుడైనా ముందు ముందు హీరోయిన్ పరంగా కథరాస్తే, దాన్ని సినిమాగా తియ్యమని ఎవరైనా ప్రొడ్యూసర్‌గారికీ, డైరెక్టర్‌గారికీ రికమెండ్ చేస్తానని ఈ సభాముఖంగా హామీ ఇస్తున్నాను...." చప్పట్లతో సభ మారుమ్రోగిపోయింది.

ఆ ఉత్సాహంతో 'విహ్వలభారతి' కార్యదర్శి పరుగు పరుగున వేదిక మీదికొచ్చి, నా మెడలో అంతకు ముందు వేసిన ఆ పది కిలోల హారాన్ని బల్లమీంచి తీసి 'రోతశ్రీ' గారి మెడలో వేసేసింది. సభలో కేరింతలు!

'రోతశ్రీ' గారు కూర్చున్నాక, 'విహ్వల భారతి' సంస్థాపకురాలు అకుంఠితాదేవి గారిని ప్రసంగించవలసిందిగా సభాధ్యక్షురాలు కోరారు. ఆమెలేచి ప్రారంభించారు.

ఈ సంస్థని స్థాపించి అయిదేళ్ళయింది. ప్రతి ఏడూ ఒక ప్రముఖ మహిళకి సన్మానం చేస్తున్నాం. ఈ ఏడు ఒక రచయిత్రికి చెయ్యాలనుకున్నాం. ఎవరికి చెయ్యాలన్న మీమాంస వచ్చింది. ఆసావేరి గారి పేరుని ఎవరో సూచించారు. కమిటీ వాళ్ళు కొందరు ఒప్పుకోలేదు–మరీ అంత పేరు లేనావిడకి చెయ్యడం ఏమిటని. నేనే అందరినీ ఒప్పించాను–ఊరూపేరూ లేని వాళ్ళని పైకి తీసుకురావడమే మన సంస్థ చెయ్యవలసినపని అని చెప్పి. ఇంకొక విషయం కూడా చెప్పాలి. నేను ఈవిడ కథలన్నిటినీ చదవలేదు. 'అత్యాచారం' కథ చదివాక ఈ రచయిత్రి మీద అభిమానం కలిగింది. సాధారణంగా కథల్లో రచయిత్రుల అనుభవాలు ఎంతో కొంత ఉండక పోవంటారు. అసావేరి గారికి అనుభవం లేకపోతే అంత మంచి కథని రాయగలిగే వారు కాదేమోనని నా అనుమానం. ఈ సన్మానం వల్ల కలిగిన స్ఫూర్తితో ఎన్నో గొప్ప కథల్ని రాయగలుగుతారని కమిటీ వాళ్ళకి చెప్పాను. (అంతా చప్పట్లు)...నా నమ్మకాన్ని వమ్ము చెయ్యరని ఆశిస్తున్నాను" అంటూ నా వైపు చూశారు. నేను చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నించాను.

అకుంఠితాదేవి గారి ప్రసంగానంతరం, ప్రముఖ రచయిత్రి ఘటికవల్లి గారి ఉపన్యాసం మొదలైంది. 'ఇది నవలా కాలం. సీరియల్స్ కోసం ఎదురు చూడని పాఠకులు లేరు. కథలకు కాలం చెల్లిపోయిన ఈ రోజుల్లో పట్టుమని పది కథలైనా రాయని ఈ అసావేరి గారిని సన్మానించడానికి సాహసం చూపించిన 'విహ్వల భారతి' అధ్యక్షురాలిని మనసారా అభినందిస్తున్నాను."

కరతాళధ్వనుల మధ్య కూర్చుందావిడ. తరవాత ప్రఖ్యాతగాయని కీచుబాయి గారు– 'అబలంటే ఆడది' సినిమాలో పాడిన 'మానం ఉంటే అనుమానం, మానం ఉంటే అవమానం....' అనే తన 'హిట్‌సాంగ్'ని పాడి సభికుల్ని రంజింపజేశారు. అంతటితో తృప్తి పడలేదు ఆహూతులు. ఇంకా ఎన్నో 'హిట్‌సాంగ్స్' పాడిందాకా వదల్లేదు.

అప్పటికే ఎంతో కాలాతీతమైపోయిందని ముందు వరసలో కూర్చున్న ముఖ్య అతిథులెందరో కుర్చీలు ఖాళీగా వదిలిపెట్టి వెళ్ళిపోయారు. సభాధ్యక్షురాలు నావైపు చూసి, నా చేతిలో ఉన్న కాగితంవైపు దృష్టి కేంద్రీకరించి, కార్యదర్శి ధన్యవాదాలు

చెప్పవలసిన జాబితా చాలా పెద్దదిగా ఉన్నందువల్ల నన్ను త్వరగా నాలుగు ముక్కలు మాట్లాడమన్నారు.

నేను లేవగానే చెదురు మదురుగా చప్పట్లు వినిపించాయి. సభా మర్యాదలు పాటించాక, ఇలా చెప్పాను. "అప్పుడప్పుడు తపన ఆపుకోలేక ఏవో కథలు రాస్తూ ఇంటి పట్టున ఉన్న నన్ను బయటికి లాగి ఈ వేదిక నెక్కించిన వారందరికీ నా ధన్యవాదాలు! నేను రాసిన కథలోని అత్యాచారం లాంటిది నా కంతకు ముందు అనుభవమేనని మీలో కొందరి అభిప్రాయం కావచ్చు. దాని మాట ఎలా ఉన్నా, ఈనాడు నాకు జరిగిన ఈ అనుభవం అంతకన్న మించినదని మాత్రం గట్టిగా చెప్పగలను. ఈ జన్మకీ అనుభవం చాలు నాకు, నమస్కారం."

చప్పట్లు కొట్టారో లేదో నేను పట్టించుకోలేదు. చెప్పదలుచుకున్న రెండు ముక్కలూ చెప్పాక "అమ్మయ్య!" అనుకున్నాను.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 7-9-1990)*